క్లుప్తంగా

ఇటిక్యాల ఎంపీడీఓగా అజార్ మోహినుద్దీన్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల నూతన ఎంపీడీవోగా గురువారం మహమ్మద్ అజార్ మోహినుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రాఘవ బదిలీపై వనపర్తి జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో కేటీదొడ్డి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉండవెల్లి ఎంపీడీఓగా..



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి నూతన ఎంపీడీఓగా అబ్దుల్ జబ్బార్ బాధ్యతలు చేపట్టారు. గురువారం ధరూర్ మండలం నుంచి బదిలీపై ఉండవెల్లి మండలానికి ఆయన వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయ రెడ్డి మానవపాడుకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సిబ్బంది నూతన ఎంపీడీఓకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏపీఓ విజయ్ శంకర్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ మంజులకు ఘన సన్మానం

ధరూరు: మండల అభివృద్ధి అధికారిణిగా పి.మంజుల గురువారం బాధ్యతలు చేపట్టడంతో ఎంపీపీ నజీమున్నీసా బేగం, కార్యాలయ సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అడ్డాకుల మండలం నుంచి బదిలీపై ఆమె ధరూరు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎండీ జబ్బార్ ఉండవెల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, ఎంపీఓ కృష్ణమోహన్, కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, షాకీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన నిత్యానంద్ ఇటీవల బదిలీ కావడంతో గురువారం నూతన మున్సిపల్ కమిషనర్‌గా సత్యబాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, మున్సిపాలిటీలోని 20 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణంలోని రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్ల ఏర్పాటుతో పాటు పట్టణం సుందరీకరణ కోసం కృషి చేస్తానన్నారు.

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: నూతన సీఐగా వచ్చిన రవిబాబు గురువారం జోగుళాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్ సీఐని సత్కరించారు. వీరితో పాటు ఎస్ఐ నాగరాజు, ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పూర్తి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించామని, నేటితో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పూర్తి అయిందని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టి పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల లైబ్రేరియన్‌గా ఎంపిక

అయిజ: పట్టణానికి చెందిన వాబనగిరి ప్రేమ్ కుమార్ గతేడాది ఆగస్టులో గురుకుల బోర్డ్ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి గురుకులాల్లో పాఠశాల లైబ్రేరియన్‌గా నియమితులయ్యారు. గురువారం ఆయనను పలువురు ప్రముఖులు అభినందించారు.

గురుకుల ఉపాధ్యాయుడిగా..

గట్టు: మండల కేంద్రానికి చెందిన రాఘవేంద్ర తెలంగాణ సాంఘీక సంక్షేమ గు రుకుల ఉపాధ్యాయుడిగా గురువారం నియామక ప త్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో పీజీటీ నియామక పత్రం అందుకున్నారు. గురుకుల ఉపాధ్యాయ ఎంపిక పరీక్షలో గట్టుకు చెందిన రాఘవేంద్ర స్టేట్ 46వ ర్యాంకు సాధించి, సోషల్, సైన్స్ ఉపాధ్యాయుడు (పీజీటీ)గా ఎంపికయ్యారు. రాఘవేంద్ర ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రయాణం ఇబ్బంది

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెళ్లాలంటే మట్టిరోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు విద్యార్థులను చూసేందుకు వస్తున్న తల్లిదండ్రుల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. మట్టి రోడ్డు కావడంతో సీసీ రోడ్డును మంజూరు చేయాలని కోరుతున్నారు.

పౌష్టికాహారమే బాలామృతం

- 7నెలల నుంచి 3ఏళ్ల లోపు వారికి పంపిణీ
- ఎత్తు, బరువులతో ఆరోగ్య లక్షణాల గుర్తింపు
- మాతా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన



మానవపాడులో బాలామృతం ప్లాస్‌ను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ అధికారులు (ఫైల్)

మానవపాడు: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. అందులో భాగంగానే చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు మాతా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం పంపిణీ అందిస్తోంది. అలంపూర్ నియోజకవర్గంలో 7మండలాలున్నాయి. వాటిలో దాదాపు 226 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. 12 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి.

మొత్తంలో మండలంలో దాదాపు ఏడు నెలలు నుంచి మూడేళ్ల చిన్నరులు 9019, మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యన 7811మంది ఉన్నారు. గర్భిణులు మొత్తం 2545, బాలింతలు 2401 మంది ఉన్నారు. విద్యార్థులకు బాలవర్ధమైన ఆహారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం బాలామృతం ప్లస్‌ను అందజేస్తోంది. బాలామృతం ప్లస్‌లో పాలపొడి, వేరుశనగ, నూనె, రైస్ గోధుమలు, కందిపప్పు, పంచదారతో పాటు కొవ్వు పదార్థాలు ఏడు నెలల వుంచి మూడేళ్ల వరకు వారి వయస్సును లెక్కిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తు, బరువు, ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని రికార్డుల్లో నమోదు చేస్తారు.

మండలం	3ఏళ్లలోపు	6ఏళ్లు	గర్భిణులు	బాలింతలు
అలంపూర్	1177	1022	295	300
ఇటిక్యాల	1284	1144	443	399
మానవపాడు	785	634	251	232
ఉండవెల్లి	744	588	223	204
వడ్డేపల్లి	918	752	285	229
రాజోళి	485	462	232	283
ఐజ	3626	3209	816	754

చిన్నారులకు ఆరోగ్య కార్డులు..

చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. పిల్లలు పాలు, గుడ్లు బాలామృతం అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు కృషి చేస్తారు.

ప్రతి రోజూ అందిస్తున్నారు



కూతురు ఎదుగుదల లోపించిందని అంగన్‌వాడీ టీచర్ ఎత్తును బరువును పరిశీలించారు. పోషకాహార లోపంతోనే ఎదుగుదల లేదని మూడు నెలలుగా బాలామృతం ప్లాస్‌ను అందిస్తున్నారు.

– రేణుక, బాలింత, చెన్నిపాడు

ఎన్నో పోషకాలు లభిస్తాయి



చిన్నారుల ఎదుగుదల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం అందిస్తోంది. ఇందుల్లో ఎన్నో పోషకాలుంటాయి. ఏడు నెలలు చిన్నారి నుంచి మూడేళ్ల లోపు వయస్సు ఉన్నవారికి అందిస్తున్నాం. చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా బరువును, ఎత్తు కొలత తీసుకుంటున్నాం.

– జ్యోతి, అంగన్‌వాడీ టీచర్, చెన్నిపాడు

చిన్నారుల ఎదుగుదలకే..



పోషకాహార లోపంతో బలహీనంగా ఉన్నవారికి బలవర్ధకమైన ఆహారం బాలామృతం ప్లాస్‌ను ప్రభుత్వం అందిస్తోంది. పోషకాహారం లోపం ఉన్న చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల సద్వినియోగం చేసుకోవాలి.

– సుజాత, ఐసీడీఎస్ సీడీపీఓ, మానవపాడు

అంజన్న జాతరలో భక్తుల సందడి



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు



స్వామికి నైవేద్యం తయారు చేస్తున్న భక్తులు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఆ యా ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వ చ్చి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ కవిత, ధర్మకర్త గిరిరావు తెలిపారు. కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం భక్తులు కనుల పండువగా నిర్వహించారు. గురువారం వేదపండితులు ఆలయంలో సుప్రభాతసేవ, తోమాల సేవ, చతుస్థానార్చనలు, నిత్యహోమం, లఘు పూర్ణాహుతి, బరిహరణ పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులు పల్లకీ సేవ, మొండిసట్టం, శేష వాహనం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారి నామస్మరణతో ఉత్తనూరు మార్మోగింది.

క్రమశిక్షణతో చదువుకోవాలి



తప్పెట్లమొర్సులో విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గట్టు: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీ చైర్ పర్సన్ సరిత కోరారు. గురువారం తప్పెట్ల మొర్సులోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట నర్సింహులు, రంగస్వామిగౌడు, దిలీప్, బజారి, గోవర్ధన్‌గౌడు, నాగేంద్ర, రామాంజనేయులు, నర్సింహులు, భీమేష్, చిన్న నర్సింహులు, రాముడు, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బాస్కెట్ బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ పోటీల్లో తలపడుతున్న పురుషుల విభాగం జట్లు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో అంతర్రాష్ట్ర బాస్కెట్ బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు నగదు బహుమతి ప్రకటించారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.25 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ. 15 వేలు ప్రకటించారు. ఈనెల 18వ తేదీ వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి బాస్కెట్ బాల్ టౌర్నమెంట్‌ను నిర్వహించనున్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి తిరుపతయ్య



రాజోళి గ్రామసభలో మాట్లాడుతున్న అధికారి

శాంతినగర్: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుతూ ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ కార్యదర్శికి, పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీఓ తిరుపతయ్య సూచించారు. వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీఓ తిరుపతయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సత్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రాజోళి: సమస్యలను పరిష్కరించుకునేందుకే గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీ రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతివార్డులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డ్రెయినేజీల సమస్య ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఖాజా మొయినుద్దీన్, ఏపీఎం కోటేశ్వరి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



సేవాలాల్ పూజలో పాల్గొన్న గిరిజనులు

కేటీదొడ్డి: సంత్ సేవాలాల్ మహరాజ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సేవాలాల్ కమిటీ సభ్యుడు రవి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఉమిత్యాలతండా, తూర్పుతండా, పూజారితండాలో బంజారా సంప్రదాయం ప్రకారం బోగు పూజా చేసి సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ గిరిజనులకే కాకుండా అందరికీ ఆరాధ్యులని అన్నారు. కార్యక్రమంలో గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గడ్డిని ముక్కలుగా కత్తిరించే 11 సబ్సిడీ యంత్రాలను పాడి రైతులు సద్వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2హెచ్‌పీ 3బ్లేడ్ చాఫ్ కట్టర్ ధర రూ.39వేలు ఉండగా, సబ్సిడీ రూ.8వేలు పోగా రూ.31వేలు, 3హెచ్‌పీ 3బ్లేడ్ సింగిల్ పేస్‌చాప్ కట్టర్ ధర రూ.46,500 ఉండగా సబ్సిడీ రూ. 10 వేలు, పోనూ రూ.36,500, అదేవిధంగా 3హెచ్‌పీ 3బ్లేడ్ 3ఫేస్ చాప్ కట్టర్ ధర రూ.48 వేలు ఉండగా సబ్సిడీ రూ.10 వేలు పోనూ రూ. 38 వేలకు లభిస్తుందన్నారు. కనుక యంత్రాలు కావల్సిన పాడి రైతులు ఈ నెల 19వ తేదీ లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం



అయిజ: మండలంలోని రాజాపురంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండి ప్రమాదవశాత్తు మరణించిన పెద్దయ్య కుటుంబానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రూ.2 లక్షల చెక్కును వారి నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు బీఆర్ఎస్ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెద్దయ్య కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

శివదీక్ష స్వీకరణ



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శివదీక్ష స్వీకరణ చేశారు. వారంతా తుంగభద్ర నదిలో పుణ్యస్నానా లు చేసి బ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకం ని ర్వహించారు. శివ స్వాములంతా ఆలయ ప్రాంగాణంలో జపమాలలు తీసుకుని 108 సార్లు పంచాక్షరి మహా మంత్రాన్ని జపించారు. అనంతరం శివదీక్ష చేపట్టిన స్వాములకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన స త్రంలో భోజన సదుపాయం కల్పించారు. ప్రస్తుతం అర్ధమండల శివదీక్ష స్వీకరిస్తున్నట్టు ఆలయ అర్చకులు ధనుంజయ శర్మ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. గురు వారం మండల కేంద్రమైన మల్దకల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

గద్వాల రూరల్: గద్వాల పట్టణానికి చెందిన శ్రీవల్లి (13)కి పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఉండడంతో ఆపరేషన్ చేయించటానికి ఆర్థిక సాయంగా రూ.10వేలు ఇచ్చినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం శ్రీవల్లి ఇంటికి వెళ్లి నగదు అందజేసి మానవత్వాన్ని చాటుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులు రాజశేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



సమ్మెను విజయవంతం చేయాలి



ఉండవెల్లిలో మాట్లాడుతున్న వెంకటస్వామి



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్ననాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను అనుసరిస్తూ కార్మిక చట్టాల మార్పు ద్వారా కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సమ్మె ఈ నెల 16న విజయవంతం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మద్దిలేటి, సీఐటీయూ మండల నాయకులు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, ఆటో డ్రైవర్స్ యూనియన్, హమాలీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ విడుదల

ధరూరు: దేశ వ్యాప్తంగా శుక్రవారం కార్మికుల చేపట్టే సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల హమాలీ సంఘం నాయకులు నర్సింహులు, దేవదాసు కోరారు. ఈ సందర్భంగా సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు వైఎస్సార్ చౌరస్తాలో విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఆంజనేయులు, రాములు, ప్రవీణ్, తిమ్మప్ప, మూకెన్న, వెంకటన్న, రంగన్న, గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాషా దినోత్సవం



సరోజినినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మల్దకల్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో సరోజినినాయుడు జయంతి పురస్కరించుకొని ఆంగ్లభాషా దినోత్సవాన్ని గురువారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్దకల్ హైస్కూల్లో సరోజినినాయుడు చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సురేష్ మాట్లాడుతూ ఆంగ్లభాషాపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయప్రద, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో నోడల్ అధికారి తనిఖీ



ప్రైవేట్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

అయిజ: పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలను గురువారం ఉపాధ్యాయ బృందం క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల అంతర్గత మార్కులు, నిర్మాణాంక మూల్యాంకనం, నమోదు చేసిన మార్కులు, సంబంధిత రికార్డులు, విద్యార్థుల నోట్ పుస్తకాలు తదితర అంశాలపై ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు మండల నోడల్ అధికారి దయాళ్ రాములు సలహాలు, సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు స్పష్టమైన అవగాహనతో చదివితేనే ఆశించిన స్థాయిలో విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతిమయాత్ర



ఎర్రవల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్ గ్రామానికి చెందిన ప్రైవేట్ విద్యుత్ హెల్పర్ రాణా ప్రతాప్ ఎర్రవల్లి మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. గద్వాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం ముగిసిన అనంతరం మృతదేహాన్ని గురువారం రాత్రి ఎర్రవల్లికి తరలించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వివిధ ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం ఎర్రవల్లి కూడలిలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

ధరూరు: ఇంట్లో భర్తతో గొడవపడిన మహిళ తన ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయిన ఘటన గురువారం మండలంలోని ర్యాలంపాడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల హనుమంతాచారి భార్య వడ్ల రేణమ్మ అలియాస్ శారద ఇంట్లో భర్తతో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన ఇద్దరు కుమారులు నందకిషోరాచారి (11), నరసింహాచారి (6) పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.